వాడవాడలా అక్షత కలశ శోభాయాత్ర



నిజాంపేట్ సాయిఅనురాగ్ కాలనీలో అయోధ్య అక్షింతలను ఊరేగిస్తున్న భక్తులు

కుత్బుల్లాపూర్: అక్షత కలశ శోభాయాత్ర కార్యక్రమం కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలో కనుల పండువగా కొనసాగుతుంది. కొంపల్లి మున్సిపాలిటీ ఎన్సీఎల్ నార్త్ కాలనీలో శ్రీరామ జన్మభూమి తీర్థ క్షేత్ర ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహించారు. అయోధ్య నుంచి వచ్చిన అక్షింతలను సాయి చైతన్య కళాశాల నుంచి సాయిబాబా గుడి వరకు ఇంటింటికీ పంపిణీ చేశారు.

◆ ఈనెల 22వ తేదీన అయోధ్యలో ప్రధాని నరేంద్ర మోదీ చేతుల మీదగా ప్రాణప్రతిష్ఠ కార్యక్రమం జరుగుతుందన్నారు. అదే రోజు ప్రతి ఇంటి ముందు దీపాలు వెలిగించి దీపావళి వేడుకలు చేసుకోవాలని మాధూరి శివాజీరాజు కోరారు. ఈ కార్యక్రమంలో కాలనీవాసులు ప్రియాంక, రమ, చంద్రకళ, సౌజన్య, ప్రవళిక, రమ్య, సుధ, గాయత్రి, సైదారెడ్డి, సంతోష్ వర్మ తదితరులు పాల్గొన్నారు.

బుచ్చిరెడ్డి ఆధ్వర్యంలో..

గాజులరామారంలోని ఆదర్శనగర్, మారుతీ నగర్, సిల్వర్ కీస్, కొలన్ ఎస్టేట్స్ ప్రాంతాల్లో నియోజకవర్గ కన్వీనర్ చౌదరిగారి బుచ్చిరెడ్డి ఆధ్వర్యంలో ఇంటింటికీ అక్షింతలతో పాటు కరపత్రాలను అందజేశారు.

సాయిఅనురాగ్ కాలనీలో..

నిజాంపేట్: అయోధ్య నుంచి తెచ్చిన అక్షింతల ఊరేగింపు కార్యక్రమాన్ని బుధవారం నిజాంపేట్ 18వ డివిజన్‌లోని సాయిఅనురాగ్ కాలనీలో వైభవోపేతంగా నిర్వహించారు. వేదపండితుల మంత్రోచ్చరనలు, జైశ్రీరామ్ నినాదాల మధ్య ఊరేగింపు కొనసాగింది. ఈ సందర్భంగా భక్తులు హారతులు పట్టారు. ఈ కార్యక్రమంలో కాలనీ అధ్యక్షుడు జనార్ధన్, శంకర్‌రావు, కాలనీవాసులు పాల్గొన్నారు.



కొంపల్లిలో అక్షింతలను అందజేస్తున్న బీజేపీ నేతలు



గాజులరామారంలో అక్షింతలను అందజేస్తున్న బీజేపీ నేత బుచ్చిరెడ్డి

ఇప్పటి వరకు 96,921 దరఖాస్తులు



రంగారెడ్డినగర్: కుత్బుల్లాపూర్, గాజులరామారం సర్కిళ్ల పరిధిలో అభయ హస్తం కింద ఇప్పటి వరకు 96,921 దరఖాస్తులు అందాయి. ఈనెల 6వ తేదీ వరకు కొనసాగే ప్రజాపాలన కార్యక్రమంలో భాగంగా ఆయా డివిజన్ల పరిధిలోని వార్డు కార్యాలయాలు, కమిటీ హాళ్లల్లో ఏర్పాటు చేసిన కేంద్రాల్లో దరఖాస్తుల స్వీకరణ కొనసాగుతోంది.

నేటి ప్రజాపాలన దరఖాస్తు స్వీకరణ కేంద్రాలు ఇవే..

కుత్బుల్లాపూర్ సర్కిల్ పరిధిలో..

రంగారెడ్డినగర్ డివిజన్..

◆ గాంధీనగర్ కమిటీహాల్‌లో మారుతినగర్, గురుమూర్తినగర్ కమిటీహాల్‌లో బీజేఆర్‌నగర్, ఆదర్శనగర్ కమిటీహాల్‌లో ఏపీహెచ్‌బీ కాలనీ, ఆదర్శ్‌నగర్ కమిటీహాల్‌లో సుమిత్రనగర్, రంగారెడ్డినగర్ సెయింట్ ఇషాక్ స్కూల్‌లో సంజయ్‌గాంధీనగర్..

సుభాష్‌నగర్ డివిజన్..

◆ సుభాష్‌నగర్ వార్డు కార్యాలయంలో మైత్రినగర్, ఎస్ఆర్ నాయక్‌నగర్ కమిటీహాల్‌లో జీవన్‌జ్యోతినగర్, అపురూపా కాలనీ కమిటీహాల్‌లో శ్రీసాయికాలనీ, సూరారం లూయిస్ బ్రెయిలీ భవనంలో ప్రియాంకనగర్..

కుత్బుల్లాపూర్ డివిజన్..

◆ పద్మనగర్ ఫేజ్-2 కమిటీహాల్‌లో బాపూనగర్ వీకర్ సెక్షన్ కాలనీ, మాణిక్యనగర్ కమిటీహాల్‌లో ద్వారకనగర్, వాణినగర్ వినాయక మండపంలో వాణినగర్, సాయినగర్, కల్పన సొసైటీ హాల్‌లో గణేశ్‌నగర్.

జీడిమెట్ల డివిజన్..

◆ ప్రసూననగర్ కమిటీహాల్‌లో హెచ్ఏఎల్ బౌద్ధనగర్, దుర్గా ఎస్టేట్స్ కమిటీహాల్‌లో మీనాక్షి ఎస్టేట్స్, కుత్బుల్లాపూర్ గ్రామం సీనియర్ సిటిజెన్స్ భవనంలో బీరప్పనగర్, గాయత్రినగర్ వార్డు కార్యాలయంలో ఎన్‌సీఎల్ ఎన్‌క్లేవ్, వెంకటేశ్వర ఎన్‌క్లేవ్.

గాజులరామారం సర్కిల్ పరిధిలో..

గాజులరామారం డివిజన్..

◆ గాజులరామారం వార్డు కార్యాలయంలో షిర్డిహిల్స్, ఉషోదయ కాలనీ కమిటీహాల్‌లో చిత్తారమ్మదేవినగర్, దేవేందర్‌నగర్ కమిటీహాల్‌లో లాల్ సాహెబ్‌గూడ, సుభాష్‌చంద్ర బోస్ కమిటీహాల్‌లో భవానీనగర్.

జగద్గిరిగుట్ట డివిజన్..

◆ జగద్గిరిగుట్ట వార్డు కార్యాలయంలో కూన మహాలక్ష్మినగర్, దేవమ్మబస్తీ గణేష్ మండపంలో సంజయ్‌పురి కాలనీ, మగ్దూమ్‌నగర్ సాయిబాబా కల్యాణ మండపంలో అంజయ్యనగర్, జగద్గిరినగర్ కమిటీహాల్‌లో మగ్దూమ్‌నగర్.

చింతల్ డివిజన్..

◆ చింతల్ వార్డు కార్యాలయంలో భగత్‌సింగ్‌నగర్, ఎన్ఎల్‌బీనగర్ కమిటీహాల్‌లో షాపూర్‌నగర్, శ్రీనివాసనగర్ కమిటీహాల్‌లో రోడామేస్త్రీనగర్.

సూరారం డివిజన్..

◆ నెహ్రూనగర్ వార్డు కార్యాలయంలో మార్కండేయనగర్, రాజీవ్‌గాంధీనగర్ కమిటీహాల్‌లో రాజీవ్‌గాంధీనగర్, సూరారం అంబేడ్కర్ భవన్‌లో విశ్వకర్మ కాలనీ, సంజయ్‌గాంధీనగర్ కమిటీహాల్‌లో ఏపీఐఐసీ కాలనీ.

ఒక్కరోజే 16,536 దరఖాస్తులు

కుత్బుల్లాపూర్: జంట సర్కిళ్ల పరిధిలో ప్రజాపాలన కార్యక్రమంలో భాగంగా అభయ హస్తం దరఖాస్తుల స్వీకరణ కొనసాగుతోంది. బుధవారం గాజులరామారం సర్కిల్ పరిధిలోని జగద్గిరిగుట్ట డివిజన్‌లో 1770, గాజులరామారం డివిజన్‌లో 3146, చింతల్ డివిజన్‌లో 1277, సూరారం డివిజన్‌లో 1816 మొత్తం 8009 దరఖాస్తులు వచ్చాయి. అదే విధంగా కుత్బుల్లాపూర్ సర్కిల్ పరిధిలోని రంగారెడ్డినగర్ డివిజన్‌లో 1898, సుభాష్‌నగర్ డివిజన్‌లో 2392, కుత్బుల్లాపూర్ డివిజన్‌లో 2517, జీడిమెట్ల డివిజన్‌లో 1720 మొత్తం 8527 దరఖాస్తులు అందినట్లు అధికారులు పేర్కొన్నారు.

సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి



హరితవనం కాలనీలోని ప్రజాపాలన కేంద్రాన్ని సందర్శిస్తున్న డిప్యూటీ మేయర్ ధన్‌రాజ్‌యాదవ్

నిజాంపేట్: అర్హులైన ప్రతి ఒక్కరూ ప్రభుత్వ సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని నిజాంపేట్ డిప్యూటీ మేయర్ ధన్‌రాజ్ యాదవ్ అన్నారు. బాచుపల్లిలోని హరితవనం కాలనీలో ఏర్పాటు చేసిన ప్రజాపాలన కేంద్రాన్ని డిప్యూటీ మేయర్ సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన పథకాల లబ్ధిపొందేందుకు తప్పకుండా దరఖాస్తు చేసుకోవాలననారు. అర్హులను గుర్తించి పథకాలను అమలు పరుస్తారని పేర్కొన్నారు.

















నేటి ప్రపంచంలో రోబోటిక్స్‌కు ఎంతో ప్రాధాన్యం

నిజాంపేట్: నేటి ప్రపంచంలో రోబోటిక్స్ ప్రాధాన్యత ఎంతో పెరిగిందని.. దీనిపై చాలా దేశాల్లో విస్తృతంగా పరిశోధనలు జరుగుతున్నాయని బాచుపల్లి వీఆర్ఎస్ విజ్ఞాన జ్యోతి పాఠశాల డైరెక్టర్ కొడాలి విజయరాణి అన్నారు. ఈ నెల 6, 7 తేదీల్లో జరిగే రోబోటిక్స్ ఈవెంట్స్ కార్యక్రమ పోస్టర్‌ను బుధవారం పాఠశాల ఆవరణలో జరిగిన కార్యక్రమంలో విజయరాణి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. దక్షిణ భారతదేశంలోనే అతిపెద్ద రొబొటిక్స్ ఈవెంట్స్‌కు తమ పాఠశాల వేదిక కావడం ఆనందంగా ఉందన్నారు. వివిధ పాఠశాలల నుంచి 500లకు పైగా విద్యార్థులు పాల్గొననున్నారని పేర్కొననారు. ప్రతిభావంతులకు బహుమతులు అందజేయనున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల డే స్కూల్ ప్రిన్సిపల్ రవి, రెసిడెన్షియల్ స్కూల్ ప్రిన్సిపల్ గీత తదితరులుపాల్గొన్నారు.



రోబోటిక్స్ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న పాఠశాల డైరెక్టర్ కొడాలి విజయరాణి

ఘనంగా సావిత్రీబాయి పూలే జయంతి



సావిత్రీబాయి పూలే చిత్రపటానికి నివాళులర్పిస్తున్న సీపీఐ నాయకులు

జగద్గిరిగుట్ట: మనువాదానికి వ్యతిరేకంగా నిలిచి స్త్రీలకు విద్యను అందించిన మొట్టమొదటి మహిళ ఉపాధ్యాయురాలు సావిత్రీబాయి పూలే అని మహిళా సమాఖ్య అధ్యక్ష, కార్యదర్శులు హైమావతి, సత్యవతి అన్నారు. మగ్దూంనగర్‌లోని సీపీఐ కార్యాలయంలో సావిత్రీబాయి జయంతి సందర్భంగా ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా నియోజకవర్గ కార్యదర్శి ఉమా మహేష్ హాజరై మాట్లాడారు. నాడు జ్యోతిబాపులే ప్రోత్సాహంతో విద్యను అభ్యసించి ఆ విద్యను అందరికి అందించాలనే ఆశయంతో స్త్రీ విద్యను ప్రోత్సహిస్తున్న సందర్భంలో అక్కడి బ్రాహ్మణ మనువాదులు ఆమెపై అనేక రకాలుగా దాడి చేశారన్నారు. వాటికి భయపడకుండా ధైర్యంగా నిలబడి స్త్రీలకు విద్యను బోధించారని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో మహిళా సమాఖ్య నాయకురాలు సత్యవతి, గోవిందమ్మ, చంద్రమ్మ, అనసూయ, మహేశ్వరి, భాగ్యమ్మ, చంద్రకళ, సరిత తదితరులు పాల్గొన్నారు.

ప్రగతినగర్ ప్రభుత్వ పాఠశాలలో...

నిజాంపేట్: సమాజ మార్పు కోసం సావిత్రీబాయి పూలే ఆశయాలను అమలు చేయగల్గితేనే ఆమెకు నిజమైన నివాళి అని జన విజ్ఞాన వేదిక మేడ్చల్ జిల్లా ప్రధాన కార్యదర్శి సీహెచ్ఎం చారి అన్నారు. సంఘ సంస్కర్త సావిత్రీబాయి జయంతిని పురస్కరించుకుని బుధవారం ప్రగతినగర్ ప్రభుత్వ పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా చారి మాట్లాడుతూ.. మహిళల విద్యను అందిచేందుకు, సంఘంలో నెలకొన్న అసమానతలను రూపమాపడానికి సావిత్రీబాయి ఎనలేని సేవలు చేశారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో సమతా విభాగం కన్వీనర్ రాఖీ అనంత కుమార్, బాచుపల్లి మండల అధ్యక్షుడు అనంతకుమార్, ఇన్‌చార్జ్ ప్రధానోపాధ్యాయులు చెన్నయ్య, ఉపాధ్యాయులు ప్రసన్న భారతి, శ్యామల, దినకర్ పాల్గొన్నారు.



సావిత్రీబాయి పూలే చిత్రపటానికి నివాళులర్పిస్తున్న సీహెచ్ఎం చారి, విద్యార్థులు



సూరారం నార్త్ సిటీ హైస్కూల్‌లో నివాళి అర్పిస్తున్న కరస్పాండెంట్ కోలా వెంకటేశ్

మార్కండేయ ఆలయ నూతన కమిటీ



జగద్గిరిగుట్ట: లక్ష్మీవేంకటేశ్వరస్వామి కొండపై వెలసిన శివ పంచాయతన సహిత మార్కండేయ ఆలయ నూతన కమిటీని బుధవారం ఎన్నుకున్నారు. ఆలయ ప్రాంగణంలో మునిపల్లి జనార్దన్ అధ్యక్షతన ఏర్పాటు చేసిన సమావేశంలో నూతన కమిటీని ఎన్నుకున్నారు. ఆలయ ఇన్‌చార్జ్‌లుగా గడ్డం జయరాములు, తౌట రాములు, దయా వెంకటేష్, అధ్యక్షులుగా భోగ రాజేష్, వర్కింగ్ ప్రెసిడెండ్‌గా మాయ కోటి ప్రభాకర్, ప్రధాన కార్యదర్శిగా రుస్తుంపేట రవీందర్ బాబు, బోడగుట్టా రాము, ఎనుగంటి శ్రీనివాస్, కోశాధికారిగా కూచి రవికుమార్, చెడుదిపు వైకుంటం (సురేష్)లను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా పద్మశాలి సంఘం నేతలు నూతన కమిటీకి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పద్మశాలి సంఘం నాయకులు తౌట నర్సింగ్ రావు, పల్లె దత్తాత్రేయ, నారా నరేందర్, సదాశివుడు, తౌట మల్లేష్, శ్రీశైలం, లింగం, ఎక్కల్ దేవ్ స్వామి, సీహెచ్ ఎల్లయ్య, కాసం నాగేశ్వర్, బోడ రాజు, మహేష్, మాసయ్య తదితరులు పాల్గొన్నారు.

'సాక్షి, నేతాజీ స్కూల్' ఆధ్వర్యంలో

6వ తేదీన ముగ్గుల పోటీలు

కుత్బుల్లాపూర్: సంక్రాంతి సంబరాలు నేపథ్యంలో 'సాక్షి'భాగ్యలక్ష్మికాలనీ నేతాజీ హైస్కూల్ సంయుక్త ఆధ్వర్యంలో ఈనెల 6వ తేదీన సంక్రాంతి ముగ్గుల పోటీలు నిర్వహిస్తున్నట్లు స్కూల్ కరస్పాండెంట్ చింతల మహేష్ కుమార్‌యాదవ్ పేర్కొన్నారు. ఉదయం 9.30గంటల నుంచి 11గంటల వరకు జరిగే ఈ కార్యక్రమంలో మహిళలు పాల్గొనాలని సూచించారు. ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులతో పాటు పాల్గొన్న ప్రతి ఒక్కరికి కన్సోలేషన్ బహుమతులు ఉంటాయని తెలిపారు. ముగ్గులు వేసేందుకు వచ్చే మహిళలు వారి వెంట కలర్స్ వారే తెచ్చుకోవాలని కోరారు.

బాలానగర్ ట్రాఫిక్ ఏసీపీకి ఉత్తమ సేవా పతకం



ఏసీపీ శ్రీనివాసులు

కుత్బుల్లాపూర్: బాలానగర్ ట్రాఫిక్ ఏసీపీ శ్రీనివాసులుకు ఉత్తమ సేవా పతాకానికి రాష్ట్ర ప్రభుత్వం ఎంపిక చేసింది. గతంలో 2005లో కఠిన సేవా సొంతం చేసుకున్న ఆయన తాజాగా ఈ అవార్డుకు ఎంపికయ్యారు. జీడిమెట్ల, బాలానగర్ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ల పరిధిలో పలు అవగాహన కార్యక్రమాలు చేపట్టి ట్రాఫిక్ నియంత్రణ విషయంలో పలు సంస్కరణలు తీసుకువచ్చి ముందుకు సాగుతున్నారు.

బెల్టు షాప్ నిర్వాహకుల అరెస్టు

దుండిగల్: బెల్టు షాపులపై దాడి చేసిన పోలీసులు నలుగురిని అరెస్టు చేశారు. దుండిగల్ తాండ-1లో, దుండిగల్ కమాన్ సమీపంలో గుట్టు చప్పుడు కాకుండా బెల్టు షాపులు నిర్వహిస్తున్నట్లు ఎస్ఓటీ పోలీసులకు సమాచారం అందింది. వెంటనే మేడ్చల్ ఎస్ఓటీ, దుండిగల్ పోలీసులు బెల్టు షాపులపై దాడులు నిర్వహించారు. వారి నుంచి 50 లీటర్ల మద్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. నలుగురు నిర్వాహకులను అరెస్టు చేశారు. వారిపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

తల్లీపిల్లల అదృశ్యం



అదృశ్యమైన తల్లి, పిల్లలు (ఫైల్)

దుండిగల్: తన ముగ్గురు పిల్లలతో సహా ఇంటి నుంచి వెళ్లిన ఓ మహిళ అదృశ్యమైన సంఘటన దుండిగల్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మల్లంపేట ఇందిరమ్మ కాలనీలో ఇంతియాజ్ అహ్మద్, రుబీనా బానో నివసిస్తున్నారు. వీరికి కుమార్తె అల్షితా(10), షూఫియాన్(08), అనాస్(02) కుమారులు ఉన్నారు. ఇంతియాజ్ మియాపూర్‌లో టైలరింగ్ పనులు చేస్తు కుటుంబాన్ని పోషిస్తున్నాడు. కాగా ఈనెల 2వ తేదీన ఎప్పటి లాగే పనికి వెళ్లిన ఇంతియాజ్ సాయంత్రం భార్యకు ఫోన్ చేయగా స్విచ్ ఆఫ్ వచ్చింది. ఇంటికి వచ్చి చూసే సరికి ఇంట్లో భార్యా పిల్లలు కనిపించలేదు. దీంతో దుండిగల్ పోలీసులకు ఫిర్యాదు చేయగా మిస్సింగ్ కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

కూరగాయల ధరలు

శేరిలింగంపల్లి: నల్లగండ్ల మార్కెట్‌లో .. టమాట 30, పచ్చిమిర్చి 60, బెండ 60, కాకర 70, దొండ 60, దోస 40, ఆలు 25, చామ 60, కీర 30, బీర 70, వంకాయ 50, గోకర 70, బీన్స్ 60, బీట్‌రూట్ 50, క్యాప్సికమ్ 70, క్యాబేజీ 25, క్యారెట్ 60.

అక్రమ నిర్మాణాలపై చర్యలు తీసుకోవాలి



దానకిశోర్‌ను కలిసిన మైనంపల్లి హన్మంత్‌రావు, కాంగ్రెస్ నేతలు

కుత్బుల్లాపూర్: కొంపల్లి మున్సిపాలిటీలో జరుగుతున్న అక్రమ నిర్మాణాలపై చర్యలు తీసుకోవడంతో పాటు స్థానికంగా నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని కాంగ్రెస్ నేతలు కోరారు. ఈ మేరకు మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ (ఎంఏయూడీఏ) ప్రిన్సిపల్ దానకిశోర్‌ను కలిసి వినతి పత్రం అందజేశారు. మల్కాజిగిరి మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావుతో కలిసి కొంపల్లి మాజీ సర్పంచ్ జెమ్మి నాగమణి, కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు బైరి ప్రశాంత్‌గౌడ్, నేతలు జెమ్మి దేవేందర్, శివకుమార్‌గౌడ్‌లు విన్నవించారు. ఫాక్స్‌సాగర్ ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్‌లను ఆక్రమించి నిర్మాణాలు చేపడుతున్నారని తెలిపారు. మున్సిపల్ నుంచి జీప్లస్ 2 వరకు అనుమతులు తీసుకుని నిబంధనలకు విరుద్ధంగా ఐదు అంతస్తులు నిర్మిస్తున్నారని పేర్కొన్నారు. అక్రమ నిర్మాణాలకు మున్సిపల్ సిబ్బంది సహకరిస్తున్నారని తెలిపారు. ఇప్పటికే పలు మీర్లు అధికారులకు ఫిర్యాదులు చేసినా పట్టించుకోలేదని చెప్పారు. ప్రభుత్వ ఖజానాకు గండి కొడుతూ ఆక్రమణలను ప్రోత్సహిస్తున్న అధికారులపై చర్యలు తీసుకోవాలని కోరారు. అదే విధంగా స్థానికంగా రోడ్లు, అండర్ గ్రౌండ్ డ్రైనేజీ సమస్యలను పరిష్కరించాలని వినతిలో పేర్కొన్నారు.

ఓక్రిడ్జ్ పూర్వ విద్యార్థుల సమావేశం



లక్డీకాపూల్: తమ పూర్వ విద్యార్థులు విభిన్న రంగాలలో రాణిస్తున్నారని ఇది ఎంతో గర్వంగా ఉందని బాచుపల్లిలోని ఓక్రిడ్జ్ ఇంటర్నేషనల్ స్కూల్ ప్రిన్సిపాల్ బల్జీత్ ఒబెరాయ్ పేర్కొన్నారు. ఇటీవల తమ స్కూల్ బాచుపల్లిలో ప్రారంభ పూర్వ విద్యార్థుల మీట్-2023 ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బల్జీత్ ఒబెరాయ్ మాట్లాడుతూ.. ఓక్రిడ్జ్ కేవలం పాఠశాల మాత్రమే కాదని, ఇది ఒక మార్గదర్శక శక్తి అన్నారు. ఆలోచనా నాయకులను రూపొందించడం, విలువలను పెంపొందించడమే లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. కార్యక్రమంలో సీనియర్ అధ్యాపకులు శ్రీధర్ మన్నం, వీఐటీ చదువుతున్న ఓక్రిడ్జ్ బాచుపల్లి పూర్వ విద్యార్థి నవ్య కుక్రేజా, నార్త్ కరోలినా విశ్వవిద్యాలయంలో చదువుతున్న పూర్వ విద్యార్థి సిమ్రాన్ పాండాలతో పాటు పూర్వ విద్యార్థులు, అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.

'మనూ' దూరవిద్య కోర్సుల గడువు పెంపు

రాయదుర్గం: మనూలో దూరవిద్య కోర్సుల రిజిస్ట్రేషన్ గడువును పొడిగించడం జరిగిందని డైరెక్టరేట్ ఆఫ్ డిస్టెన్స్ ఎడ్యుకేషన్(డీడీఈ) డైరెక్టర్ ప్రొఫెసర్ మహ్మద్ రజావుల్లాఖాన్ బుధవారం తెలిపారు. దూరవిద్యాకోర్సులలో అండర్ గ్రాడ్యుయేట్, గ్రాడ్యుయేట్ కోర్సుల కోసం పోర్టల్ ద్వారా రిజిస్ట్రేషన్ చేసుకునేందుకు జనవరి 10వ తేదీ వరకు అవకాశం ఉందని అర్హులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు. మరిన్ని వివరాలకోసం 'మనూ' వెబ్‌సైట్‌ను చూడాలని ఆయన కోరారు.

చదువు మనిషిలోని అజ్ఞానాన్ని తొలగిస్తుంది

ఎమ్మెల్యే వివేకానంద్

కుత్బుల్లాపూర్: చదువు జీవితంలో అజ్ఞానాన్ని తొలగిస్తుందని వయసుతో సంబంధం లేకుండా విద్యను కొనసాగించడానికి డిస్టెన్స్ ఎడ్యుకేషన్ తోడ్పాటును అందిస్తుందని ఎమ్మెల్యే వివేకానంద్ అన్నారు. బుధవారం పేట్ బషీరాబాద్‌లోని క్యాంప్ కార్యాలయంలో శ్రీసాయి డిస్టెన్స్ ఎడ్యుకేషన్ సంస్థ ఆధ్వర్యంలో రూపొందించిన నూతన సంవత్సర డైరీని ఎమ్మెల్యే ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో శ్రీ సాయి డిస్టెన్స్ ఎడ్యుకేషన్ సంస్థ నిర్వాహకులు బెజగం వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

కాలనీ అభివృద్ధికి సహకరించాలని వినతి

◆ రావి నారాయణరెడ్డి నగర్ (తూర్పు) వెల్ఫేర్ అసోసియేషన్ నూతన కమిటీ సభ్యులు ఎమ్మెల్యేను మర్యాద పూర్వకంగా కలిసి తమ కాలనీ అభివృద్ధికి సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు నారాయణ, ప్రధాన కార్యదర్శి హన్మంత్ నాయక్, వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

కమలాకర్‌కు జన్మదిన శుభాకాంక్షలు

◆ గాజులరామారం డివిజన్ బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు, మేడ్చల్ జిల్లా ప్రభుత్వ న్యాయవాది కమలాకర్ జన్మదిన వేడుకలు ఎమ్మెల్యే సమక్షంలో ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు రావుల శేషగిరి, మంత్రి సత్యనారాయణ, మాజీ కార్పొరేటర్ సురేష్‌రెడ్డి, కొంపల్లి మున్సిపల్ వైస్ చైర్మన్ గంగయ్య నాయక్, నిజాంపేట్ కార్పొరేటర్ ఏనుగుల శ్రీనివాస్‌రెడ్డి, దుండిగల్ కౌన్సిలర్ శ్రీనివాస్ రెడ్డి తదితరులు ఉన్నారు.

నూతన సంవత్సర డైరీ ఆవిష్కరణ

◆ హెచ్ఎంటీ ఎంప్లాయిస్ కో-ఆపరేటివ్ హౌస్ బిల్డింగ్ సొసైటీ లిమిటెడ్ ఆధ్వర్యంలో రూపొందించిన నూతన సంవత్సర డైరీని ఎమ్మెల్యే ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో సొసైటీ ఉపాధ్యక్షుడు టీవీ సత్యనారాయణ, కార్యదర్శి పండని, డైరెక్టర్లు తులసీదాస్, శ్రీశైలం, అనంత రాములు తదితరులు పాల్గొన్నారు.



నూతన సంవత్సర డైరీని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే వివేకానంద్